శ్రీవారికి,

శ్రీమతి వ్రాయు చివరి ఉత్తరం. మీకు ఇలాంటి ఉత్తరం వ్రాయవలసి వస్తుందని కలలోకూడా ఊహించలేదు. మీరు ఇలాంటి పని చేస్తారని తలచనైనా తలచలేదు. ఎంత బుద్ధిమంతుల్లా నటిస్తారు! మీ నటనకు నా జోహార్లు. అపర శ్రీరామచంద్రులా తమరు! ఏకపత్నీవ్రతం వెలగబెడుతున్నట్లు ఎంచక్కా పోజులు పెట్టేవారు. అదంతా నిజమేనని నమ్మి మోసపోయాను. నన్ను ప్రేమించానని చెప్పి మోసంతో వంచించారు అటు కన్నవాళ్ళనీ దూరం చేసుకున్నాను. ఇటు మీరూ నన్ను నట్టేట్లో ముంచారు. ఏదరి చేరినా ఒకటే. అందుకే శాశ్వతంగా మీకు దూరంగా వెళ్ళిపోతున్నాను.

మిమ్మల్నే నా సర్వస్వంగా యెంచి నా జీవితాన్ని మీకు అర్పించాను. నా అంత అదృష్టవంతురా లెవరూ వుండబోరని మురిసిపోయాను. మీరు చూపించే ప్రేమానురాగాలు నా సొంతం అనుకున్నాను. కాని.... కాని.... మీరు చేసిందేమిటి? నమ్మించి గొంతు కోస్తారా! ఇంత ద్రోహం తలపెడ్తారా!

అయినా! మీకు నేను చేసిన లోటేమిటి? మిమ్మల్నెప్పుడన్నా కించపరిచానా! మీ ఇష్టానికెప్పుడయినా కాదన్నానా! మిమ్మల్ని ఇంకా.... ఇంకా... సుఖపెట్టాలని, సంతోషపెట్టాలని ప్రతిక్షణమూ ఆరాటపడేదాన్నే! నన్నే మీరు అవమానపరుస్తారా! నన్ను కాదని వేరే స్త్రీని ఆశ్రయిస్తారా! ఇలా జరగటానికి నేనేమయినా ద్రోహం చేశానా! మరెక్కడుంది లోపం!

ఈ గొడవంతా నాకెలా తెల్సిందా! అని ఆశ్చర్యపోతున్నారా! నిన్న మీ శ్రేయోభిలాషి, మీ ప్రియతమ మిత్రుడు మీ కార్యకలాపాల్ని, కేళీవిలాసాల్ని సవివరంగా వర్ణించాడు. త్వరలో మీరు ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకోబోతున్నట్టూ చెప్పాడు. అంటే మీకు నానుంచి విడాకులయినా కావాలి. లేదా నేను చావనైనా చావాలి. చావటానికయినా ఒప్పుకుంటాను కాని, విడాకులు మాత్రం చస్తే ఇవ్వను. ఇంత బ్రతుకు బ్రతికి ఇంటెనక చచ్చినట్లు నేను బ్రతికుండగనే రెండో పెళ్ళికి తయారయిన మీ ముఖం చూడాలని లేదు. మీతో కాపురం చేయాలన్న కోరికా లేదు. అందుకే ...అందుకే ...మీనుంచి దూరంగా....దూర తీరాలకు తరలివెళ్తున్నా. కాని నా చిట్టిబాబు సంగతే అర్థం కాలేదు. వాడిని ఎవరు పెంచుతారు అనేబాధ నన్ను పట్టిపీకిస్తోంది. అయినా వాడికి తండ్రి ఉండగా నేనెందుకు వాడిని గురించి ఆలోచించాలి? వాడి భవిష్యత్తు మీ ఇష్టానికి వదిలేస్తున్నా. మీరీ ఉత్తరం చదివేప్పటికి నేను శాశ్వతంగా ఈ బంధాలనుండి విముక్తిపొందాలనే ప్రయత్నంతో.

—శ్రీలత

ఉత్తరం చదవటం పూర్తిచేసిన శేషుకు అంతా అయోమయంగా ఉంది. ముచ్చెమటలుపోసి, కాళ్ళు గడగడా వణకసాగాయి. ఏమీ తోచడంలేదు. గొంతు తడారిపోతోంది. ఎక్కడి కెళ్ళుంటుందబ్బా! బాబుగాడేడీ? వాణ్ని కూడా తీసుకెళ్ళిందా? వాడి బాధ్యతంతా నాదేనందే! మరి వాణ్ని ఎందుకు తీసుకెళ్ళినట్టు? ఎటు వెళ్ళిందబ్బా! ఏమీ పాలుపోవడంలేదు. ఇలా ఆలోచిస్తున్న శేషుకు భయం భయంగా ఉంది.

అంతలో—

వంటింట్లో గిన్నెల చప్పుడుకు ఆ వైపుకు పరుగుతీశాడు. ఆమె భర్తను చూస్తూనే కాఫీ కప్పులోకి వంపి అందించింది "తీసుకోండి" అంటూ.

కప్పు అందుకోబోయి ఆమెని పరిశీలనగా చూస్తుండిపోయాడు.

"అదేం? కాఫీ ఇస్తుంటే నా ముఖంలోకి అలా చూస్తారు? ఏమయినా వింతగా వుందా ఈ వేళ నా ముఖం?" అంది నవ్వుతూ.

"అహ.... అబ్బే అదేం లేదే!" అని అంటూ, "అవును గాని.... ఇదేమిటి?" మళ్ళీ తనే అంటూ చేతిలోని కాగితాన్ని ఆమెకందించాడు.



# నీకు అర్థంకాదులే

"ఇదా! ఏం? మీరు చదివారా! బాగుందా! ఏదన్నా కథ రాద్దామని మొదలెట్టా... కాని ఎందుకో ఇక రాయలేకపోయా! అంతటితో ఆపి కాస్త కాఫీ అన్నా పట్టిస్తే, ఏదన్నా అయిడియా వస్తుందేమోనని ఇలా వంటింట్లోకొచ్చా" అని అంది.

"నా ముఖం లాగుంది! హడలెత్తించావ్" అంటూ తనలోని ఆందోళనని, భయాన్ని, అనుమానాన్ని అదుపులో పెట్టుకుంటూ చిరుకోపాన్ని ప్రదర్శించాడు శేషు.

"అయినా! మీకెందుకంత గాభరా! ఇది మనకేమీ సంబంధించిందిగాదుగా? మధ్యలో మీకెందుకు హడలు?" అంది అతన్నే చూస్తూ అతనెందుకంత కంగారుపడ్తున్నాడో అర్థంగాక.

"నీకు అర్థంకాదులే! అర్థం అయితే ఇలానే నా మొహాన ఇలాంటి ఉత్తరమే పడేసి పారిపోతావ్" అని అనుకుంటూ ఆ కాగితాన్ని ఆమె చేతిలోనుంచి తీసుకొని—

"ఇకముందెప్పుడూ ఇలాంటి కథలు మొదలెట్టి నన్ను గాభరాపెట్టకు దయచేసి" అని అంటూ ముఖానికి పట్టిన చెమటను తుడుచుకున్నాడు శేషు.

—వాణీ పాపారావు వీరంకి